క్లుప్తంగా

84 అంశాలతో కౌన్సిల్ తీర్మానం

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ కార్యాలయంలో స్థానిక నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో నగర పంచాయతీ పరిధిలోని సీసీ రోడ్లు, నీటి కుళాయి పైపులు, డ్రైనేజీలు తదితర పనులకు సంబంధించి 84 అంశాలతో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ.. నగరపంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రజల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు చెప్పారు. సమావేశంలో కమిషనర్ ఐ.శ్రీనివాసులు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తి

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పార్వతీ సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం చెన్నకేశవస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ ధ్వజారోహణం, స్వామివారి ఉత్సవం నిర్వహించారు. ఉత్సవ ఉభయ దాతలుగా పలువురు దంపతులు వ్యవహరించారు. వేదపండితులు నంద్యాల వెంకట కృష్ణ కిరణ్, నుదురుపాటి వెంకటకృష్ణారావు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



చిదంబరంను సన్మానిస్తున్న కాపు నాయకులు

కంభం: హైకోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, బార్ కౌన్సిల్ మెంబర్ కలిగినీడి చిదంబరంను శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవా సంఘ ఏబీసీ మండల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బుధవారం గిద్దలూరులో ఓ వివాహానికి హాజరైన ఆయన కంభం రాగా సంఘ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు. కార్యక్రమంలో అడ్వకేట్ యు.మల్లికార్జున, కాపు నాయకులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని బుధవారం జిల్లా రిజిస్ట్రార్ ఆళ్ల బాలాంజనేయులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్ల రికార్డులు పరిశీలించారు. ఇల్లు ఉండి కూడా ఖాళీ స్థలం కింద రిజిస్ట్రేషన్ చేశారా, డోర్ నంబర్ కనబరుస్తూ తక్కువ విలువ చూపి ప్రభుత్వానికి నష్టం వాటిల్లే విధంగా వ్యవహరించారా అనే అంశాలను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ కృష్ణమోహన్‌పై వచ్చిన పలు ఆరోపణపై సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు.

ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ఏపీడీ స్వర్ణ భాస్కర్‌రావు

రాచర్ల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని ఏపీడీ స్వర్ణ భాస్కర్‌రావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండలంలోని 14 పంచాయతీల్లో 16 వేల జాబ్‌కార్డులు ఉన్నాయని, ప్రస్తుతం 2 వేల మంది మాత్రమే పనులకు వెళ్తున్నారని, ఇంకా 1500 మంది కూలీలను పెంచి పనులు చేయించాలన్నారు. ప్రతి కూలీకి రూ.307 కూలి దక్కేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి సురక్ష యోజన బీమా పథకంలో కూలీలను ఇన్సూరెన్స్ చేయించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ మహాలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పన్నులపైనే మోజు.. వీధులేమో గలీజు

- అంతర్గత రహదారులు, డ్రెయినేజీల అభివృద్ధిపై అశ్రద్ధ
- పట్టణ వాసులను వేధిస్తున్న మురుగు, వీధి లైట్ల సమస్యలు

గిద్దలూరు రూరల్:

నగర పంచాయతీలో మౌలిక వసతుల కల్పనపై పాలకుల నిర్లక్ష్యం గిద్దలూరు వాసులను నిరంతరం వేధిస్తోంది. పన్ను వసూళ్లలో గిద్దలూరు నగర పంచాయతీ జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని గొప్పగా చెప్పుకొన్న ఇక్కడి అధికారులు పుర ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు.

వేధిస్తున్న మురుగు సమస్య

నగర పంచాయతీలోని 20 వార్డుల్లో ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రధానంగా శ్రీరామ్‌నగర్, రాజానగర్, ఆర్టీసిబస్టాండ్ ఏరియా, పాములపల్లెరోడ్డు, నల్లబండబజారు, అర్బన్ కాలనీల్లోని రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాములపల్లె రోడ్డులోని సాయిసిద్ధార్థ్ స్కూల్ వీధిలో గృహాల వాడుక నీరు సీసీ రోడ్డుపై చేరడంతో మురుగుకుంటలా మారి కనీసం నడిచేందుకు కూడా వీల్లేకుండా పోయింది. ఈ మార్గంలో బైక్‌లు, ఇతర వాహనాలు వెళ్లే సమయంలో మురుగు ఎగజిమ్మి పాదచారులపై పడుతుండటంతో ఘర్షణలు తలెత్తుతున్నాయి. ఈ విషయమై నగర పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, వెంకటేశ్వర కాలనీ వైపు ఖాళీ స్థలాల్లో పెద్ద ఎత్తున మురుగు చేరడంతో కుంటలను తలపిస్తున్నాయి. దోమలు విజృంభిస్తుండటంతో ఆయా ప్రాంతాల ప్రజలు రోగాలు ప్రబలుతాయని ఆందోళన చెందుతున్నారు. నగర పంచాయతీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల మురుగు సమస్య తీవ్ర రూపం దాల్చుతోంది. తేలికపాటి వర్షం కురిసినా కొన్ని ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు సైతం మురుగు కాలువలుగా మారిపోతున్నాయి.



పాములపల్లె రోడ్డులో బైక్ వెళ్తున్న సమయంలో ఎగజిమ్ముతున్న మురుగు

వీధి లైట్లు వెలిగేనా?

రాజానగర్‌లోని పుట్ట వద్ద గల వీధిలైటు నెల రోజుల నుంచి వెలగడం లేదు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాజానగర్‌లోని ప్రధాన రహదారికి ఒక వైపు చిల్లచెట్లు ఏపుగా పెరగడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. పైగా వీధిలైట్లు వెలగకపోవడం, విష సర్పాల భయం కారణంగా రాత్రి సమయంలో ప్రజలు బయటకు రావాలంటేనే ఆందోళన చెందుతన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మురుగు తటాకం



రాజానగర్‌లో నెల రోజులుగా వెలగని వీధి లైటు

ఎంపీ వైవీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన 'అన్నా'



వైవీ సుబ్బారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న అన్నా రాంబాబు

మార్కాపురం: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డికి మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం మద్దిపాడు మండలం వెల్లంపల్లిలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరైన వైవీ సుబ్బారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట మార్కాపురం నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు ఉన్నారు.

చిన్నారులకు లేవా వేసవి సెలవులు?

బేస్తవారిపేట: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించింది. అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రం సెలవులు ఇవ్వలేదు. ఎండలు మండుతుండటంతో తల్లిదండ్రులు తమ చిన్నారులను కేంద్రాలకు పంపాలంటే భయపడుతున్నారు. దీంతో హాజరు శాతం నానాటికీ తగ్గిపోతోంది. చిన్న పిల్లల విషయంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందో అర్థం కావడం లేదంటూ చిన్నారుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

కేంద్రాల్లో ఉక్కపోత

బేస్తవారిపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో బేస్తవారిపేట మండలంలో 82, అర్ధవీడులో 60, కంభం మండలంలో 57 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో 2,633 మంది చిన్నారులు నమోదై ఉన్నారు. చాలా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక అద్దె గదుల్లో నిర్వహిస్తున్నారు. ఇరుకు గదులు కావడం, ఫ్యాన్లు కూడా లేకపోవడంతో చిన్నారులు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీలకు పంపకుండా ఇంట్లోనే ఉంచుతున్నారు.



బేస్తవారిపేటలో తక్కువగా హాజరైన చిన్నారులు

ఉగ్రదాడి మృతులకు ఘన నివాళి

మార్కాపురం: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిలో మృతి చెందిన పర్యాటకుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ పట్టణంలో బీసీ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ సీపీ నాయకుడు పీఎల్పీ యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో పీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

అత్యవసర పనులకే తొలి ప్రాధాన్యం

- ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి
- ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించే దిశగా కృషి చేయాలి
- మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ



మాట్లాడుతున్న చైర్మన్ బాలమురళీకృష్ణ

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘ పరిధిలో ప్రజలకు అత్యంత అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ సూచించారు. సమస్యలు ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని స్పష్టం చేశారు. బుధవారం స్థానిక అమరజీవి పొట్టిశ్రీరాములు కౌన్సిల్ హాల్లో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. పురపాలక సంఘ పరిధిలో గుర్తించిన 46 అనధికార లేఔట్లలో ప్లాట్లు క్రయవిక్రయాలు చేపట్టకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఓ పత్రికలో(సాక్షి కాదు) అడ్వర్టైజ్‌మెంట్ ఇచ్చారు. కానీ ఒక్కటి కూడా ఆపిన దాఖలాలు లేవు. దీనివల్ల ఉపయోగం ఏముంది. అక్రమ లేఔట్లు ఉన్న ప్రాంతాల్లో అభివృద్ధి పనులను నిలిపివేయండి' అని కమిషనర్ నారాయణరావుకు సూచించారు. కొండేపల్లి రోడ్డులో గోశాల నిర్వహణ నిమిత్తం 5 లక్షల రూపాయలతో ఫెన్సింగ్‌తోపాటు వివిధ అభివృద్ధి పనులను చేపట్టి గోసంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులకు మంజూరైన నగదు తిరిగి మున్సిపల్ ఖాతా 001కు జమ అవుతోందని, ఇందుకు సంబంధించి విధి విధానాలు రాగానే సదరు కాంట్రాక్టర్లకు చెల్లిస్తామని తెలిపారు. ప్రస్తుతం మున్సిపల్‌శాఖ మంత్రి సీఎఫ్‌ఎంఎస్‌కు అనుసంధానంగా గ్రీన్ చానల్‌ను ఏర్పాటు చేశారని, కార్యాలయ నిర్వహణకు 75 శాతం, అభివృద్ధి పనులకు 25 శాతం నగదు వెంటనే చెల్లించనున్నట్లు కమిషనర్ వివరించారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా మలేరియా యూనిట్ అధికారి మధుసూదన్‌రావు

మార్కాపురం టౌన్: మలేరియా జ్వరంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా మలేరియా యూనిట్ అధికారి మధుసూదన్‌రావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక డీవైఎంహెచ్‌ఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యారోగ్య సిబ్బంది గ్రామాలకు వెళ్లి దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించాలని ఆదేశించారు. త్రిపురాంతకం, యర్రగొండపాలెం, తిప్పాయిపాలెం పీహెచ్‌సీలను సందర్శించి సిబ్బందికి సూచనలిచ్చారు. సమావేశంలో డాక్టర్ పద్మావతి, సబ్‌యూనిట్ అధికారి నాగేందర్‌రెడ్డి, వెంకటరెడ్డి, విజయభాస్కర్, ఇజ్రాయేల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబనతో మహిళా సాధికారత

కొమరోలు: ఆర్థికంగా నిలదొక్కుకోగలిగినపుడే మహిళలు సాధికారత సాధించగలరని ఎంపీడీఓ మస్తాన్‌వలి పేర్కొన్నారు. కొమరోలు గ్రామ సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ శిబిరాన్ని బుధవారం తనిఖీ చేశారు. మహిళలు సకాలంలో హాజరై టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సూరవారిపల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ తనిఖీ చేశారు. సర్వేలు వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

ట్రెజరీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా

మార్కాపురం: జిల్లాలో ట్రెజరీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఏపీ ట్రెజరీ అండ్ అకౌంట్స్ స్టాఫ్ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నికైన ఎస్‌కే మస్తాన్‌వలి పేర్కొన్నారు. బుధవారం ఆయనను ట్రెజరీ కార్యాలయంలో ఏటీఓ కెనడీ, ఎన్‌జీఓ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసశాస్త్రి, రెవెన్యూ, మెడికల్, వెటర్నరీ, పంచాయతీరాజ్ అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించారు. రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రవికుమార్, రాజ్‌కుమార్, ఎస్‌కే అబ్దుల్ ఖాదర్ సహకారంతో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.



మస్తాన్‌వలిని సన్మానిస్తున్న ఏటీఓ కెనడీ, ఎన్‌జీఓ నాయకులు

కమిషనర్‌ను కలిసిన ఎన్‌జీఓలు



కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎన్‌జీఓ సంఘ నాయకులు

పొదిలి: నూతనంగా బాధ్యతలు చేపట్టిన నగర పంచాయతీ కమిషనర్‌గా జీఎల్ నారాయణరెడ్డిని ఆయన చాంబర్‌లో స్థానిక ఎన్‌జీఓ సంఘ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉప ఖజానా అధికారి ఎస్‌వీ కృష్ణను కలిశారు. ఎన్‌జీఓ తాలూకా యూనిట్ అధ్యక్షుడు ఎల్.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి షేక్.సందానీ బాష, ఉపాధ్యక్షుడు షేక్.కరీముల్లా, కె.విజయ, సంయుక్త కార్యదర్శి షేక్.యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.